క్లుప్తంగా

డిగ్రీ విద్యార్థినికి ల్యాప్‌టాప్



ల్యాప్‌టాప్ అందిస్తున్న కలెక్టర్, తదితరులు

ఖమ్మం సహకారనగర్: హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు మద్దినేని ప్రసాదరావు – కమల దంపతుల ఆర్థిక సహకారంతో డిగ్రీ విద్యార్థిని యేగినాటి హారికకు రూ.40 వేల విలువైన ల్యాప్‌టాప్‌ను మంగళవారం కలెక్టర్ గౌతమ్ చేతుల మీదుగా అందించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థిని చదువుకు అవసరాన్ని గుర్తించి ల్యాప్‌టాప్ అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ బాధ్యులు కొంగర పురుషోత్తమరావు, రాయల నరసింహారావు, యలమద్ది వెంకటేశ్వర్లు, మద్దినేని రవి, వేగినాటి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలకు భవన నిర్మాణం

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి స్థలాన్ని గుర్తించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. ఆయన మంగళవారం ఖమ్మం రమణగుట్ట రజక వీధి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈక్రమాన అద్దె ఇంట్లో అరకొర వసతుల నడుమ పాఠశాల కొనసాగుతోందని తెలుసుకున్న కలెక్టర్ వెంటనే స్థల సేకరణ చేపట్టి భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులకు సూచించారు. అక్కడే ఉన్న ప్రభుత్వ స్థలాన్ని సైతం పరిశీలించిన కలెక్టర్, సర్వే చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. డీఈఓ సోమశేఖరశర్మ, ఎంఈఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి నివాళి

ఖమ్మంవన్‌టౌన్: సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పరుచూరి మురళి తల్లి అనారోగ్యంతో మంగళవారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నగరంలోని బైపాస్ రోడ్డులో ఉన్న మురళి నివాసానికి వెళ్లి ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. మంత్రితో పాటు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, రాష్ట్ర విద్యా మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయబాబు, కార్పొరేటర్ దొడ్డా నగేష్, మిక్కిలినేని నరేందర్, కొప్పెర ఉపేందర్, బాణాల లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి క్రికెట్ పోటీలు

నేలకొండపల్లి: ఖమ్మం డివిజనల్ స్థాయి క్రికెట్ పోటీలను మండలంలోని నాచేపల్లిలో ఈనెల 13నుంచి నిర్వహిస్తున్నట్లు యువజన సంఘం బాధ్యుడు గట్టిగుండ్ల విజయ్ తెలిపారు. పోటీల్లో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచే జట్లకు వరుసగా రూ.22,222, రూ.15,555, రూ.11,111, రూ.5,555 అందించడమేకాక బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ బౌలర్ బహుమతులు కూడా ఇస్తామన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వివరాల కోసం 95051 33745, 93476 05971 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

16న నెలనెలా వెన్నెల

ఖమ్మంగాంధీచౌక్: నెలనెలా వెన్నెల 83వ అభ్యుదయ సాంస్కృతిక కదంబం ఈనెల 16న నిర్వహిస్తున్నట్లు అమరజీవి అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మోటమర్రి జగన్మోహన్‌రావు, ఓ.సుబ్రమణ్యకుమార్ తెలిపారు. ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు విజయవాడకు చెందిన న్యూస్టార్ మోడ్రన్ థియేటర్ ఆర్ట్స్ బాధ్యులు 'కపిరాజు' నాటికను ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. కళాకారులు, కళాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

కాంగ్రెస్‌లో చేరిక

రఘునాథపాలెం: మండలంలోని కోయచలకలో బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారని నాయకులు తెలిపారు. గ్రామానికి చెందిన బలుసుపాటి కాటయ్య, కొరకుప్పల దుర్గ తదితరులు కుటుంబాలతో సహా కాంగ్రెస్‌లో పార్టీ గ్రామ అధ్యక్షుడు చెరుకూరి సీతారాములు కండువాలు కప్పి ఆహ్వానించగా.. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రులను కలిసిన తాండ్ర

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం బీజేపీ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన తాండ్ర వినోద్‌రావు నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన కేంద్ర మంత్రులను ఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్, జ్యోతిరాధిత్య సింధియా, గజేంద్రసింగ్ లకావత్‌లకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సత్కరించారు.

చెరువు పనుల పరిశీలన

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం చెరువుకట్ట మరమ్మతు పనులను మంగళవారం ఇరిగేషన్ డీఈఈ మన్మధరావు పరిశీలించారు. చెరువు కట్టపై కట్టమైసమ్మ దేవాలయం సమీపాన కట్ట కుంగడంతో పాటు జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టగా వాటిని పరిశీలించి శరవేగంగా పూర్తి చేయాలన్నారు. నిబంధనల మేరకు చెరువు మట్టి తరలించాలన్నారు. ఆయన వెంట ఇరిగేషన్ ఏఈ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పేరుకే డొంక రోడ్లు..



ఆనవాళ్లు లేకుండా పోతున్న బాలపేటతండా – ఎల్‌బీ నగర్ పాతడొంక..



ఖానాపురం నుంచి రఘునాథపాలెం బైపాస్ రోడ్డుకి లింక్ రోడ్డు

కనుమరుగవుతున్న డొంక రోడ్ల ఆనవాళ్లు

- ఆక్రమణలలో కుదించుకుపోతున్న వైనం
- కొత్త రహదారుల రాకతో పాతబడుతున్న పాత డొంకలు
- మ్యాపులకే పరిమితమవుతున్న రోడ్లు
- లింక్ రోడ్లతో తగ్గనున్న దూరాభారం, తీరనున్న ట్రాఫిక్ సమస్య
- రియల్ మాఫియా నుంచి కాపాడాలని పలువురి వేడుకోలు



రఘునాథపాలెంలో ఇటీవల వేసిన తారురోడ్డు

ఖమ్మంఅర్బన్: గతంలో ఏర్పాటు చేసుకున్న పాత డొంక రోడ్లన్నీ రానురాను ఆక్రమదారుణలతో కుదించుకుపోతున్నాయి. ఒకప్పుడు వివిధ గ్రామాలకు రాకపోకలు సాగించాలంటే ఎద్దుల బండ్లు లేదా కాలినడకన వెళ్లేవారు. ఆ సమయాన డొంక రోడ్లు కీలకంగా ఉండేవి. తర్వాత కాలంలో ప్రభుత్వాల పాలనలో మార్పులు వచ్చి పాలనను గ్రామాల చెంతకు చేర్చడంతో పాటు మండల వ్యవస్థను తీసుకురావడంతో రవాణాను సులభతరం చేశారు. దీంతో కొత్త రోడ్లు ఏర్పడి పాత డొంకలను పట్టించుకునేవారు కరువయ్యారు. ప్రస్తుత కాలంలో రైతులు మాత్రమే ఎక్కువగా వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు వీటిని వినియోగిస్తుండడంతో అరకొరగా డొంకరోడ్లు కనపడుతున్నాయి.

లింక్ రోడ్ల రూపకల్పన..

పలు గ్రామాల్లో ఉన్న డొంక రోడ్లకు ఇటీవల కాలంలో ప్రభుత్వం కోట్లాది రూపాయలు కేటాయించి తారు రోడ్లుగా మార్చుతుండడంతో అందమైన లింక్‌రోడ్లు ఏర్పడుతున్నాయి. ఈనేపథ్యాన ఒక్క రఘునాథపాలెం మండలంలోనే అనేక డొంక రోడ్లను గ్రామీణ లింక్ రోడ్లు అభివృద్ధి పథకంలో భాగంగా నిధులు కేటాయించి అందమైన రహదారులుగా మార్చుతున్నారు.

'రియల్' మాయ..

నగరంలో రియల్ ఎస్టేట్ వ్యాపారంతో వెంచర్లు వెలిచి ఆయా వెంచర్లదారులే ప్రధాన రోడ్లుకు లింక్ రోడ్లు మారడంతో నగరంలోని డొంక రోడ్లు అవసరం లేకుండా పోతున్నాయి. దీంతో వాటిని చుట్టుపక్కల వ్యవసాయ భూములు ఉన్న రైతులు వెంచర్లు చేసి అమ్ముకుంటుండగా.. రియల్ వ్యాపారులు సైతం డొంకలను ఆక్రమించి కనుమరుగు లేకుండా చేసి తప్పుడు పత్రాలు సృష్టించి అమ్మకాలు చేసిన సంఘటనలు ఉన్నాయి.

ఆనవాళ్లు కనుమరుగు..

ప్రభుత్వ మ్యాపుల్లో ఉన్న 30, 40, 60 అడుగుల డొంక రోడ్ల ఆనవాళ్లు కనబడకుండా పోతున్నాయి. కొంతమంది డొంకలను తమ పక్క ప్లాట్లలో ఆక్రమించి గత ప్రభుత్వం కల్పించిన 59 జీఓ ద్వారా వాటిని క్రమబద్ధీకరించుకున్నారు. ఇప్పటికైనా నగరం శివారులో ఉన్న డొంకలు పూర్తిగా కనుమరుగు కాకముందే వాటిని సంరక్షించి లింక్‌రోడ్లుగా అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు. తద్వారా వివిధ గ్రామాల ప్రజలకు రాకపోకలకు ఎంతో అనువుగా ఉండడంతో పాటు నగరంలో ట్రాఫిక్ సమస్యల నుంచి కొంతమేర తగ్గించినట్లవుతోంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు కరిగిపోయిన డొంకల మాట అటు ఉంచినా ఉన్న డొంకలైనా కాపాడుకుంటే ఉపయోజనకరంగా ఉంటుందని పలువురు కోరుతున్నారు.

ఆనవాళ్లు లేని డొంకలు..

- నగరంలోని కల్లూరు పాత డొంక అంటే తెలియని వారు ఉండరు. అలాంటి డొంక రోడ్డులో కొన్నిచోట్ల డొంక ఆనవాళ్లే కనబడడంలేదని స్థానికులు చెబుతున్నారు.
- బల్లేపల్లి నుంచి పాండురంగాపురం వరకు ఉన్న పాత డొంక చాలా వరకు కనపడకుండానే పోయింది. రికార్డుల్లో మాత్రం డొంక ఉన్నట్లు మ్యాప్‌లు ఉంటాయి.
- ఖానాపురం నుంచి గోపాలపురం వరకు బాలపేట నుంచి గోపాలపురం, బాలపేటతండా నుంచి ఎల్‌బీనగర్, టేకులపల్లి నుంచి రఘునాథపాలెం బైపాస్‌రోడ్డు వరకు, గొల్లగూడెం అల్లీపురం, గొల్లగూడెం కొత్తగూడెం, కొత్తగూడెం పుట్టకోట ఇలా నగరంలో వీలిన గ్రామాల పరిధిలో ఉన్న డొంకలను అభివృద్ధి చేస్తే నగరవాసులకు ట్రాఫిక్ సమస్య లేకుండాపోతుంది.

వినతుల వెల్లువ

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలి..

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలని టీపీటీఎఫ్ నాయకులు కలెక్టర్ గౌతమ్‌కు విన్నవించారు. మంగళవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన అనంతరం టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.విజయ్ మాట్లాడుతూ.. పదోన్నతుల్లో రిజర్వేషన్ ప్రక్రియను కొనసాగించాలని, అనారోగ్యంగా ఉన్న వారికి మెడికల్ సర్టిఫికెట్లు ఇప్పించాలని, పాత రోస్టర్ విధానాన్ని కొనసాగించాలన్నారు. ఆన్‌లైన్ అప్పీల్‌కు సైట్ ఓపెన్ కానందున మరో రోజు అవకాశం ఇవ్వాలని, పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, ఆకుల నాగేశ్వరరావు, దేవేందర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి..

రఘునాథపాలెం: గ్రామ పంచాయతీ సిబ్బందికి సంబంధించిన పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌కు విన్నవించారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో వినతిపత్రం సమర్పించిన అనంతరం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గాదె లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. పెండింగ్ వేతనాలు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా బాధ్యులు ఎస్‌కె ఖానెల్, పిట్టల మల్లయ్య, మంగీలాల్, రాజగోపాల్, లింగయ్య, సీతారాములు, రేణుక, విజయలక్ష్మి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసులు పెంచాలి..

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలో గ్రామీణ ప్రాంతాలకు బస్సు సర్వీసులను పెంచాలని పీఓడబ్ల్యూ–పీవైఎల్ ఆధ్వర్యాన ఖమ్మం డిపో మేనేజర్ శ్రీనివాసరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.శిరోమణి మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకం తర్వాత ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య పెరగడంతో పాటు నూతన విద్యాసంవత్సరం ప్రారంభమైన నేపథ్యాన అటు ప్రయాణికులకు, ఇటు విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు బస్సుల సంఖ్య పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రేమ్‌సింగ్, ఎన్‌వి.రాకేష్, పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకులు ఝాన్సి, శోభ, నాయకులు సురేష్, రవీందర్, పూలమ్మ, లలిత తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి..

కామేపల్లి: ఏజెన్సీ ప్రాంత ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని కోరుతూ హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో విద్యాశాఖ జాయింట్ సెక్రటరీ పుల్లారావుకు తెలంగాణ స్టేట్ ట్రైబుల్ టీచర్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ వీరూనాయక్ మంగళవారం వినతిపత్రం అందజేశారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల పోస్టులు మంజూరు చేయాలని, 317 ఉపాధ్యాయులకు బదిలీలలో అవకాశం కల్పించాలని, అడక్వేసి పదాన్ని తొలగించి రోస్టర్ విధానంలో పదోన్నతులు, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు ఇవ్వాలని వినతిలో కోరారు.



ఖమ్మంసహకారనగర్: కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి..

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీటీయూ అనుబంధ యూఈఈయూ యూనియన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న దశల వారీ ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం వరంగల్ టీజీ ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సంస్థ చైర్మన్ కర్నాటి వరుణ్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఆర్టిజన్లను పర్మినెంట్ ఉద్యోగులుగా కన్వర్షన్ చేయాలని, కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని, సంస్థలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, అందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించాలని, 2011 జేఎల్‌ఎంలకు ఏరియర్స్ ఇవ్వాలని, కంపెనీలో జేఎల్‌ఎంలకు ప్రమోషన్లు కల్పించాలని తదితర డిమాండ్ల వినతి పత్రాన్ని సీఎండీకి అందించి, వివరించారు. అనంతరం సీఎండీ మాట్లాడుతూ.. జేఎల్‌ఎంల ప్రమోషన్ల తరువాత బదిలీల ప్రక్రియ ఉంటుందని వివరించినట్లు సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కంపెనీ అధ్యక్ష, కార్యదర్శులు జి.ఆంజనేయులు, ఎం.ప్రసాద్, గౌరవ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి..

రఘునాథపాలెం: నాగపూర్–అమరావతి జాతీయ రహదారి నిర్మాణంలో భూమి కోల్పోతున్న రైతులకు తగిన న్యాయం చేయాలని బాధిత రైతులు కోరారు. ఈ సందర్భంగా రఘునాథపాలెం మండలంలో భూములకు సంబంధించి అవార్డు ప్రకటించిన రైతులు మంగళవారం ఖమ్మం ఆర్డీఓ గణేష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. రఘునాథపాలెం, కోయచలక, రేగులచలక, కామంచికల్, నగరంలోని బల్లేపల్లి ప్రాంతాలకు చెందిన రైతులు ఆర్డీఓని కలిసి పరిహారం చెల్లింపు విషయంలో న్యాయం చేయాలని, సర్వే నంబర్లు, విస్తీర్ణం, పేర్లలో తప్పులు సరిచేయాలని కోరారు.

పాత బస్టాండ్ భోజనశాల తనిఖీ



సూచనలు చేస్తున్న ఆర్‌ఎం

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం పాత బస్టాండ్‌లో ఆర్టీసీ ఉద్యోగులు 20 మంది కలిసి ఒకేసారి భోజనం చేసేలా సౌకర్యాలు కల్పించాలని అధికారులను, సిబ్బందిని ఆర్టీసీ ఆర్‌ఎం సీహెచ్.వెంకన్న ఆదేశించారు. ఈ నెల 11న సాక్షిలో 'బస్సులోనే భోజనం' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు పాత బస్టాండ్‌లో భోజనశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం బస్టాండ్ ప్రాంగణాన్ని పరిశీలించి, ఉద్యోగులు భోజనం చేసే భోజనశాలను తనిఖీ చేశారు. అక్కడ సౌకర్యాలు లేమిని గుర్తించిన ఆర్‌ఎం సివిల్ ఇంజనీరింగ్ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. భోజనశాలలో వర్షం కురవకుండా ఏర్పాట్లు చేయడంతో పాటు ఫ్యాన్లు, తాగునీరు, వాష్‌బేసిన్ ఏర్పాటు చేయాలని, ప్రతి రోజు శుభ్రం చేయించాలని డిపో అధికారులను ఆదేశించారు. బస్టాండ్‌లో మొక్కలు నాటేందుకు అనువైన ప్రాంతాల్లో గ్రీనరీని పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీనివాసరావు, డీఈ, ఏఈ, ఎస్‌ఎం, తదితరులు పాల్గొన్నారు.

భట్టికి ఆహ్వానం



భట్టికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న లింగాల

ఖమ్మం మామిళ్లగూడెం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రజా సంక్షేమ సంఘం 25 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్‌లో ఆగష్టు 25న నిర్వహించే జాతీయ మహాసభకు సంబంధించిన తొలి ఆహ్వాన పత్రికను తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు బీఆర్ అంబేడ్కర్ ప్రజా సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు లింగాల రవికుమార్ అందజేశారు. మంగళవారం భట్టి క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా లింగాల మాట్లాడుతూ.. 25 ఏళ్ల ప్రజాప్రస్థానం పుస్తకం ఆవిష్కరణతో పాటు ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అంబేడ్కర్ ఉద్యమ స్ఫూర్తితో మరింత ముందుకు సాగుతామని ఆయన తెలిపారు.

కొత్త వంగడాలు, మెళకువలతో అధిక దిగుబడి



రైతు నేస్తంలో పాల్గొన్న అధికారులు, రైతు సంఘం నాయకులు

రఘునాథపాలెం: రైతులు సాగులో మెళకువలు పాటిస్తూ కొత్త వంగడాలను ఎంచుకుంటే వానాకాలం సాగులో అధిక దిగుబడి సాధించొచ్చని శాస్త్రవేత్తలు సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమాన్ని రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంలోని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ అధికారులు, రైతులు వీక్షించారు. ఈ సందర్భంగా పలువురు శాస్త్రవేత్తలు మాట్లాడుతూ నూతన పరికరాలతో సాగు విధానం, భూసార పరీక్షల వల్ల లాభాలు, ఎరువుల యాజమాన్యం, అందుబాటులో ఉన్న నూతన వంగడాలు తదితర అంశాలను వివరించారు. అలాగే, విత్తనాల కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ వీసీకి వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు రమణ, సరిత, శ్రీనివాసరావు, ఏఓలతో పాటు నల్లమల వెంకటేశ్వరరావు, భాస్కర్‌రావు, యరగర్ల హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలను ఆధునికీకరించాలి



మామిళ్లగూడెం ప్రభుత్వ పాఠశాలలో పడిపోయిన బోర్డును పరిశీలిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ పాఠశాలల్లో ఒకప్పుడు వందలాది మంది విద్యార్థులతో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు నేడు వెలవెలబోతున్నాయని, విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందుతుందని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ అన్నారు. మంగళవారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యాన నగరంలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్భాటంగా ఫ్లెక్సీ పెట్టి, ఫొటో దిగి బడిబాట ప్రచారాన్ని నిర్వహిస్తే విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు రారని, మౌలిక వసతులు కల్పిస్తే వస్తారన్నారు. ప్రభుత్వం విద్యారంగ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకుంటే సంఘం ఆధ్వర్యాన ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా సహాయ కార్యదర్శి శివ, వంశీ, హరికృష్ణ, బాలాజీ, మనోజ్, అయ్యప్ప, ప్రసాద్, నవీన్, సాయి, నరేష్, గోపి, ప్రతాప్, వెంకటేష్, నాగరాజు పాల్గొన్నారు.

ఆటంకాలు లేకుండా చూస్తాం..

ఖమ్మం సహకారనగర్: భాషా పండితులు, పీఈటీల అప్‌గ్రేడేషన్ ప్రక్రియల్లో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూస్తామని ఎస్టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు అన్నారు. మంగళవారం ఎస్టీఎఫ్ కార్యాలయంలో భాషా పండితులు, పీఈటీలు దేవరకొండ సైదులను కలిశారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తుందని, ఈ క్రమంలో బదిలీలు, పదోన్నతులు సజావుగా సాగేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దృష్టికి సైతం సమస్యలు తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకన్న, రవీందర్, కె.అనిల్, పి.వెంకటేశ్వర్లు, ఎం.సుమలత, జె.శ్రీనివాస్, టి.దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి రోజే యూనిఫాం, పుస్తకాలు అందించాలి

నేలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాలలు బుధవారం ప్రారంభమవుతున్న దృష్ట్యా పండుగ వాతావరణం ఉండేలా ఏర్పాట్లు చేయాలని ఎంఈఓ బి.రాములు హెచ్‌ఎంలకు సూచించారు. తొలిరోజు ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దల సమక్షాన సమావేశాలు నిర్వహించి విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలను అందించాలని తెలిపారు. అలాగే, అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యేలా పర్యవేక్షించాలని, బడి ఈడు పిల్లలు చేరేలా కృషి చేయాలని ఎంఈఓ సూచించారు.

సమస్యలపై మంత్రులకు వినతి

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ బెస్ట్ విదేశీ పథకాలతో పాటు అర్చకుల గౌరవ వేతనం బకాయిలపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు భట్టి, పొంగులేటి, తుమ్మల, శ్రీధర్‌బాబు, కొండ సురేఖను కలిసి వినతి పత్రాలు అందించాలని బ్రాహ్మణ సంఘాల ఐక్యవేదిక నిర్ణయించింది. మంగళవారం ఖమ్మం మామిళ్లగూడెంలోని అఖిల భారత బ్రాహ్మణ(సర్వీస్) నెట్‌వర్క్, హెల్ప్‌లైన్ కార్యాలయంలో జరిగిన అత్యవసర సమావేశంలో మారం రాజురాధా కృష్ణారావు, గెంటెల శ్రీనివాసరావు, సూరా వజ్జుల వాసు, రావులపాటి శ్రీనివాసరావు, శ్రీకాంత్, మాటూరి లక్ష్మీనారాయణ, శివరాజు, శ్రీరమ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బ్రాహ్మణ సంఘాల ఐక్యవేదిక నాయకులు

నిఘా నీడలో గురుకులం



గురుకులంలోని సీసీ కెమెరాల ఫుటేజీ

నేలకొండపల్లి: సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలల్లో విద్యార్థినుల భద్రతకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. ఈనేపథ్యాన నేలకొండపల్లి మండలం సింగారెడ్డిపాలెంలోని గురుకుల బాలికల పాఠశాలలో 16 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. డైనింగ్ హాల్, ప్రధాన ద్వారం, తరగతి గదులు, గురుకులం చుట్టూ వీటిని బిగించి ప్రిన్సిపాల్ గది నుంచి మానిటరింగ్ చేస్తున్నారు. ఇక్కడ 640మంది విద్యార్థినులు ఐదో తరగతి నుంచి ఇంటర్‌మీడియట్ వరకు చదువుతుండగా.. వీరిలో ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల వారు ఉన్నారు. ఈమేరకు విద్యార్థినులకు ఎలాంటి భయం లేకుండా రక్షణ కవచంగా ఉండేలా నిఘా నేత్రాలను ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ ప్రమీల తెలిపారు.

విజ్ఞాన జ్యోతి స్కాలర్‌షిప్‌కు విద్యార్థినుల ఎంపిక



ప్రేరణ పోటీలకు ఎంపికైన గ్రేషిత

నేలకొండపల్లి: మండలంలోని సింగారెడ్డిపాలెం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ ఈ.ప్రమీల పేర్కొన్నారు. మంగళవారం గురుకుల పాఠశాలలోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురుకులంలో 9వ తరగతి చదువుతున్న కె.గ్రేషిత జిల్లాస్థాయిలోని ప్రేరణ కాంపిటేషన్‌లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి, ఆపై గుజరాత్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు చెప్పారు. అదే విధంగా గురుకుల పాఠశాలలో చదివిన 24 మంది విద్యార్థినులు విజ్ఞాన జ్యోతి స్కాలర్‌షిప్‌కు ఎంపిక కాగ ఒక్కో విద్యార్థినికి రూ.12 వేల చొప్పున అందించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

కరపత్రాల ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం: అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యాన ఈ నెల 16న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం ఖమ్మంలో కరపత్రాలను ఆవిష్కరించారు. విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బుద్దిస్ట్ శోభానాయక్, బహుజన పొలిటికల్ సెంటర్ రాష్ట్ర నాయకులు పొడకంటి రాంబాబు మాట్లాడుతూ.. అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు బీఆర్ అంబేడ్కర్ మనవడు బీమ్రావ్ యశ్వంత్ అంబేడ్కర్ ముఖ్య అతిథిగా వస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు లింగబోయిన లక్ష్మణ్, విశారధన్ మహరాజు, సీతామహలక్ష్మి, మాలాద్రి, వీరన్న, దిశ, రామారావు, రామ్మూర్తి, సురేష్, శ్రీను, కనకయ్య, దాసరి శ్రీను, జక్కుల రామారావు, విజయ్, వెంకయ్య, దానియేలు, కొంగర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు కొని నష్టపోవద్దు..

కూసుమంచి: రైతులు నకిలీ విత్తనాలు కొని నష్టపోవద్దని కూసుమంచి ఏడీఏ విజయచంద్ర సూచించారు. మంగళవారం కూసుమంచిలోని రైతు వేదికలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విత్తన లైసెన్సులు కలిగిన డీలర్ల వద్దే కొనుగోలు చేయాలని, రశీదు తప్పకుండా పొందాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా విత్తనాలు విక్రయించేందుకు వస్తే తమకు సమాచారం అందించాలన్నారు. ఈ సమావేశంలో డిజిటల్ గ్రీన్ సంస్థ ప్రతినిధులు బిశ్రేతి రాయ్, దేబేష్ రాయ్ పాల్గొని రైతులకుసాగుబాగు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఏఓ వాణితో పాటు ఏఈఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ విజయచంద్ర

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

కామేపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం పింజరమడుగు గ్రామంలో వింజం నాగభూషణం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు కల్లా రూ.2 లక్షల రుణమాఫీ ఒకే దఫాలో చేయాలని, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు అందించాలని, ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 చొప్పున చెల్లించి 200 రోజులు పని దినాలను కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి కృష్ణ, మండల కార్యదర్శి అంబటి శ్రీనివాస్‌రెడ్డి, బాదావత్ శ్రీనివాస్, ఏర్పుల శాంతయ్య, కాటినేని కృష్ణమూర్తి, ఆడప ఉపేందర్, కిన్నెర రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.